గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించిన కందుల సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్దకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదివారం సందర్శిస్తున్న సందర్భంగా హనుమంతునిపాడు మండల తెలుగు రైతు అధ్యక్షులు కందుల వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మండలం నుండి బయలుదేరిన టీడీపీ నాయకులు నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షులు గాయం రామిరెడ్డి దొడ్డిచింతల మాజీ సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి తదితరులు గుండ్లకుమ్మ ప్రాజెక్టు వద్దకు చేరుకొని ప్రాజెక్టును సందర్శించడం జరిగింది.

విశాలాంధ్ర
ప్రకాశం జిల్లా

ప్రజలకు అండగా వైసీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర-దర్శి : రాష్ట్రంలోని ప్రజలకు వైకాపా ప్రభుత్వం అండగా నిలుస్తుంది అని పేదల అభ్యునతే ద్యేయం గా పని చేస్తున్నది జగనన్న ప్రభుత్వం అని దర్శి ఎమెల్యే మద్దిశెట్టి వేణు గోపాల్ అన్నారు. మండలంలోని చలివేంద్రం లో అనారోగ్యం తో బాధ పడుతున్న మాజీ సర్పంచ్ బూసి రాజు ఏడు కొండలును ఎమెల్యే ఆదివారం పరామర్శించారు. అద్యేర్య పడొద్దు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయనకు ఎమెల్యే వేణుగోపాల్ ఇరవై ఐదు వేలు రూపాయలు ఆర్థిక సహాయం ను అందచేశారు. ఆయన వెంట మిల్లరు బుజ్జి, సర్పంచ్ శ్రీనివాసులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

గద్దర్ మృతితో మంత్రి సురేష్ దిగ్భ్రాంతి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గద్దర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు గద్దర్ అండగా నిలిచాడని కొనియాడారు. తన గేయాలతో ప్రజలను చైతన్య పరిచి ఆలోచింపజేసిన ప్రజానాయకుడు గద్దర్ అని మంత్రి ప్రసంశించారు. గద్దర్ మరణం తెలుగు రాష్ట్రాల్లోని బడుగు, బలహీన, పేద వర్గాలకు తీరని లోటన్నారు.

గద్దర్ మరణం సాంస్కృతోద్యమానికి తీరని లోటు

సీపీఐ ప్రకాశం జిల్లా సమితి సంతాపం

విశాలాంధ్ర-ఒంగోలు : గద్దర్ మరణం భారత సంస్కృతొద్యమానికి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గద్దర్ మరణానికి సిపిఐ ప్రకాశం జిల్లా సమితి సంతాపం ప్రకటించింది. ఈ సందర్భంగా ఎం ఎల్ నారాయణ మాట్లాడుతూ నమ్మిన మార్క్సిజం లేని నిజం సిద్ధాంతం కోసం తుది ప్రాణాలు విడిచే వరకు నిలబడిన వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. విప్లవ ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోయేందుకు గద్దర్ ఆట, పాట, మాటను ఆయుధాలుగా మలుచుకున్నారన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమంలో, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో గద్దర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు గద్దర్ మృతికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.

చింతలచెరువును కలిసిన ఏపీ ఎన్జీవో నేతలు

విశాలాంధ్ర-కనిగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి కనిగిరి ఏపీ ఎన్జీవో సంఘం నేతలు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఏపీఎన్జీవోలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించాలంటూ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువును కోరారు. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తప్పనిసరిగా ప్రభుత్వ అధికా రులకు రాష్ట్ర ప్రభుత్వం మేలు చేసేందుకు కృషి చేస్తుందని, చిన్నచిన్న సమస్యలు ఉంటే వాటిని తప్పనిసరిగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్తానని చెప్పారు. సత్యనారాయణరెడ్డి స్పందించిన తీరుతో ఏపీఎన్జీవోస్ అభినందించారు.

గుంటి గంగలో భక్తుల కోలాహలం

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రకాశం జిల్లాలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తాళ్లూరు మండలం తూర్పు గంగారం పంచాయతీ పరిధిలోగల గుంటి గంగక్షత్రంలో ఆదివారం భక్తుల కొలహలు నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండి భక్తులు పాల్గొని నైవేద్యాలతో, పొంగళ్లతో అమ్మవారి మొక్కులు తీర్చుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు .దేవాదాయ శాఖ ఈవో ఏబీ భాస్కర్ రెడ్డి దేవాలయంలో ఉండి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. 643 దర్శనం టికెట్లు, 16 వాహన పూజలు జరిగాయని, భక్తులు అమ్మవారికి 16 చీరలు, 8438 రూపాయల విరాళాలు అందించారని, ఆదివారం ఒక్కరోజు 16,468 రూపాయల ఆదాయం లభించినట్లు దేవాదాయ శాఖ రికార్డ్ అసిస్టెంట్ కే శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ సిబ్బంది, పూజారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సేంద్రియ ఎరువులు అధిక దిగుబడికి కల్పతరువు

విశాలాంధ్ర-తాళ్లూరు : సేంద్రియ ఎరువులు పైర్ల అధిక దిగుబడికి కల్పతరువుగా మారుతుందని మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్‌రావు అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన మండలంలోని శివరామపురం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పంట పొలాల్లో సేంద్రియ ఎరువులు చల్లుతున్న భూములను పరిశీలించి దీనిపై రైతులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు ఎంత ఉపయోగించినప్పటికీ సేంద్రియ ఎరువులకు సమానంగా ఉండబోదని సేంద్రియ ఎరువులే పంటలకు శ్రీరామరక్షగా మిగులుతాయని ఆయన అన్నారు. ప్రతి రైతు సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా సేంద్రియ ఎరువులు ఉపయోగించినట్లయితే పొలం గుల్లవారడంతో పాటు నీరు నిలువ ఉండి ఎక్కువ దిగుబడి ఇవ్వడానికి సహకరిస్తుందని ఆయన తెలిపారు. సాధారణంగా ఎకరాకు 5 ట్రక్కుల ఎరువును ఉపయోగించి పొలంలో చల్లినట్లయితే పంటల ఎదుగుదలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

కందిసాగుపై అవగాహన

విశాలాంధ్ర-దర్శి : మండలంలోని మారెడ్డిపల్లి గ్రామం చందలూరు యూనిట్‌లో ప్రకృతి వ్యవసాయ కార్యకర్త డి.మూర్తయ్య ఆధ్వర్యంలో కంది పంటలను సాగుచేసిన ప్రకృతి వ్యవసాయ రైతుల పొలాలకు అధిక బెట్టనుండి జీవామృతంతో పిచికారి చేస్తే బెట్ట నుండి తట్టుకోవచ్చని అవగాహన కల్పించారు. వ జీవామృతం తయారు చేయుటకు కావలసిన పదార్థాలు 200 లీటర్ల నీటి డ్రమ్ములో 180 లీటర్ల నీరు, 10 కిలోలు ఆవు పేడ, 10 లీటర్లు ఆవు మూత్రం, 2 కిలోలు నల్ల బెల్లం,2 కిలోలు పప్పుదినుసులు పిండి, గుప్పెడు పుట్ట మట్టి వేసి 7 రోజులు మరిగి నాక 1 ఎకరాకు మొక్కలు పై సాయంత్రం పిచికారీ చేస్తే తొందరగా వాడి పోకుండా పంటలను కాపాడుకోవచ్చని రైతులతో తయారు చేపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జె. పెద్దన్న ఉన్నారు.

దొనకొండ రైల్వే స్టేషన్‌కు పూర్వ వైభవం

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- రూ.18.3 కోట్లతో రైల్వే స్టేషన్ అభివృద్ధికి శ్రీకారం

విశాలాంధ్ర-దొనకొండ: దొనకొండ రైల్వే స్టేషన్‌కు పూర్వ వైభవం రానుందని మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. గుంటూరు డివిజన్ ఏడీఆర్ఎం ఆర్.శ్రీనివాస్, సీనీయర్ డీపీఓ షెహాబాజ్ ఆధ్వర్యంలో అమృత భారత్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి సురేష్ ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొనగా రైల్వే సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ గతంలో లోకో షెడ్ ఉన్నప్పుడు వందల మంది ఇక్కడ ఉపాధి కలిగి, నిత్యం ఉద్యోగులతో, ప్రయాణికులతో స్టేషన్ రద్దీగా ఉండేదన్నారు. రైల్వే లైన్ అభివృద్ధిలో భాగంగా లోకో షెడ్ ఎత్తి వేయటంతో క్రమేణా హీన స్థితికి చేరుకున్న దొనకొండ స్టేషన్ తిరిగి అమృత భారత్ పథకం ద్వారా పూర్వ వైభవానికి నోచుకుంటున్నట్లు తెలిపారు. దొనకొండకు రూ.18.3 కోట్లు నిధులు కేటాయించి అత్యాధునిక వసతులతో తీర్చి దిద్దుతున్నట్లు తెలిపారు. ప్రధాని మోడి, ఎంపీ మాగుంట శ్రీనివాసరావు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ఈ అభివృద్ధి జరుగుతున్నట్లు మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే వేణుగోపాల్ మాట్లాడుతూ దేశంలో ఈ పథకం ద్వారా 508 స్టేషన్‌లను అభివృద్ధి చేస్తుండగా అందులో దొనకొండ ఉండటం ఎంతో సంతోషకరమన్నారు. 2024 మార్చి నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేస్తారని ఎమ్మెల్యే వివరించారు. కరోనా వ్యాప్తి సమయం నుండి దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు నిలుపుదల చేయడం లేదని, వినుకొండ, నరసరావుపేట, గుంటూరు తదితర దూర ప్రాంతాలకు వెళ్ళేందుకు బస్సు సౌకర్యం లేని మండల ప్రజలకు అన్ని రైళ్ళు నిలుపుదల చేసి మేలు చేయాలంటూ ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ వేదికపై అధికారులను కోరారు. ముందుగా రైల్వే అధికారులు ప్రధాని మోడి ప్రసంగాన్ని ఆన్‌లైన్ మీడియా ద్వారా వినిపించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే ఏడీఆర్ఎం అభివృద్ధి పనులకు శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. వ్యాస రచన పోటీలలో గెలుపొందిన జడ్‌పి, విశ్వభారతీ, సెయింట్ ఆంటోనీస్ విద్యార్థులకు మంత్రి, ఎమ్మెల్యే చేతులపై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, తహసీల్దార్ యం.సువర్ణ, ఎంపీడీఓ వసంతరావునాయక్, బీజేపీ జిల్లా నాయకులు తిండి నారాయణరెడ్డి, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్దకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదివారం సందర్శిస్తున్న సందర్భంగా కనిగిరి టీడీపీ ఇంచార్జ్ మరియు మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి,మాజీ ఎమ్మెల్యే డోల బాల వీరాంజనేయ స్వామి గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ను సందర్శిస్తున్న సందర్భంలో ఆదివారం హనుమంతునిపాడు మండల నుండి బయలుదేరిన మండల నాయకులు కోటపాటి శేషయ్య, మువ్వా రంగసాయి యాదవ్, గంగిరెడ్డి రమేష్ రెడ్డి,గాయం కృష్ణారెడ్డి లు కలసి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని మరియు మాజీ ఎమ్మెల్యే డోలా వీరాంజనేయ స్వామిని మర్యాదపూర్వకంగా కలసి గుండ్లకుమ్మ ప్రాజెక్టు వద్దకు చేరుకొని ప్రాజెక్టును సందర్శించడం జరిగింది.

ఎంపీని కలిసిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మా గుంట శ్రీనివాసులు రెడ్డిని ముండ్లమూరు వైకాపా నాయకులు ఆదివారం ఒంగోలులో కలిసి పుష్పగుచ్చం అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. మండలం లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తమ్మలూరు గ్రామానికి ఐడిసి వాటర్ పైపులైన్ కోసం ఐదు లక్షల, సిమెంట్ రోడ్డు కు 10 లక్షలు. వాటర్ ప్లాంట్‌కు 5 లక్షలు మొత్తం 20 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ముళ్ళమూరు జడ్పిటిసి సభ్యుడు తాతపూడి మోజెస్ రత్నం రాజుకు 10 లక్షలకు గ్రావెల్ రోడ్డు ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఎంపీకి అభినందనలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో వైస్ ఎంపీపీ బంకా రమణమ్మ నాగిరెడ్డి, వైసీపీ మండల యువ నాయకులు మందలపు అశోక్, వైసిపి సీనియర్ నాయకులు కొర్రపాటి శ్రీనివాసరావు(చంటి), తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పెద్ద పీట : చైర్మన్ పిచ్చయ్య

విశాలాంధ్ర-దర్శి : దర్శి మున్సిపల్ పరిధిలో సమస్యలు పరిష్కారానికి పెద్ద పీట వేసి సమస్యలు పరిష్కరిస్తునట్లు మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. దర్శి పట్టణంలోని పదోవ వార్డులో ఆయన ఆదివారం పర్యటించారు. పట్టణంలో గల ఇరవై వార్డులో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకొని ప్రణాళిక బద్ధంగా పరిష్కరిస్తుమ్మని తెలిపారు. పార్టీల కు అతీతంగా పనులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. టిడిపి మీద అభిమానం గాని, మా కుటుంబం మీద గౌరమం తో కాని నన్ను గెలిపించిన దర్శి ప్రజలకు ఋణపడి ఉంటానని తెలిపారు. పదోవ వార్డులో మురికి కాలువ లో పూడిక తియంచి, బ్లీచింగ్ చాలించారు. అనంతరం అంటూ వ్యాధులు ప్రబ్లకుండా పాగింగ్ చేయించారు. ఆ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంచి నీటి సమస్య ఉందని అ వార్డులోని ప్రజలు తెలియ చేయగా త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట కౌన్సిలర్ పసుపులేటి శేషమ్మ, దాత్తత్రేయ, మీరవలి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో టీడీపీ విజయం ఖాయం

- మాజీ ఎమెల్యే నారపుశెట్టి పాపారావు

విశాలాంధ్ర-దర్శి : దర్శిలో టిడిపి విజయం ఖాయమని, ఎన్నికల దాక కార్యకర్తలతో మమేకం అయ్యి కార్యకర్తలలో ఉతేజ్జం నింపి టిడిపి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని మాజీ ఎమెల్యే నారపుశెట్టి పాపారావును టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కోరారు. సాగు నీటి ప్రాజెక్టులు విధ్వంసంపై యుద్ధ భేరిపై చంద్రబాబు చేపట్టారు. అందులో భాగంగా సంతనూతలపాడు నియోజకవర్గం పరిధిలోని మద్దిపాడు మండలంలో మల్లవరం వద్ద గుండ్లకమ్మపై ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్‌ను చంద్రబాబు నాయుడు పరిశీలించారు. అక్కడకు వచ్చిన మాజీ ఎమెల్యే పాపారావును చంద్రబాబు కుశల ప్రశ్నలు వేశారు. దర్శి నియోజకవర్గంలో టిడిపికి మంచి పట్టు ఉందని దీనికి నిదర్శనం మే మున్సిపల్ ఎన్నికలలో విజయమేనని, ఇటీవల దర్శి నియోజకవర్గంలో చేపట్టిన యువగళం పాదయాత్రకు అపూర్వ స్పందన వచ్చిందని అన్నారు. ఐక్య మత్యం తో పని చేసి టిడిపి విజయానికి కృషి చేయాలన్నారు. చంద్రబాబు ని మున్సిపల్ చైర్మన్ నారపు శెట్టి పిచ్చయ్య, సమన్వయ కమిటీ సభ్యులు కూరపాటి శ్రీను, బొమ్మిరెడ్డి ఓబులు రెడ్డి, చిట్టే వెంకటేశ్వర్లు, నాగుల పాటి శివ కోటేశ్వరరావు, పిడతల నెమ లయ్య, యాదగిరి వాసు, మాజీ యంపిపి మందలపు వెంకటరావు, సంగా తిరుపతి రావు కలసారు.

గ్రీన్ అంబాసిడర్ల జీతాలు ప్రభుత్వమే చెల్లించాలి

వీరభద్రాచారి సర్పంచుల సంఘం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : గ్రామ పంచాయితీలలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ జీతాలు ప్రభుత్వమే చెల్లించాలని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీర భద్రాచారి డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పదిహేనవ ఆర్థిక సంఘం నిధులు అరకొరగా విడుదల చేసి వాటిలో గ్రీన్ అంబాసిడర్ జీతాలు, బకాయిలతో సహా చెల్లించాలన్న అధికారుల ఆదేశాలు వ్యతిరేకించాలని సర్పంచుల కు వీరభద్రాచారి సూచించారు. సర్పంచులు ఈ విషయంలో అత్యవసర పంచాయితీ తీర్మానం ద్వారా అధికారులకు తెలియజేయాలని వీరభద్రాచారి తెలిపారు. గ్రీన్ అంబాసిడర్‌ల జీతాలు చెల్లించరాదని, పీఎఫ్ఎంఎస్ విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పంచాయితీల విస్తరణాదికారి రెండవసంతకం రద్దయిందన్నారు. పనుల తా లూకు బిల్లులు నేరుగా మీ ఖాతాల నుండి డ్రా చేసుకోవచ్చునని వీరభద్రాచారి తెలిపారు.

12,13 తేదీల్లో జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు

విశాలాంధ్ర-పామూరు : ఈ నెల 12, 13 తేదీలలో కనిగిరిలో జరుగునున్న జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల జన విజ్ఞాన వేదిక మహాసభలు జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం అశాస్త్రీయ అంశంగా పేర్కొన్నారు. దాంతోపాటు రోజురోజుకీ పెరుగుతున్న అశాస్త్రి భావజాలాలు, మణిపూర్ ఘటనపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తప్పుపట్టారు. మహారాష్ట్ర, కేరళ మాదిరిగా ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేశారు. పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా యూత్ కన్వీనర్ జి.శ్రీనివాసులు మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం పనిచేస్తున్న జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని కోరారు. యువత అశాస్త్ర భావజాలాల వైపు మరలకుండా ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం జన విజ్ఞాన వేదికపామూరు మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీకి గౌరవా ధ్యక్షులుగా డాక్టర్ టి.చెన్న కృష్ణ, అధ్యక్షులుగా షేక్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శిగా కాలేశంకర్, కార్యదర్శిగా దేవరాజు, ఉపాధ్యక్షులుగా ఉత్తరరావు, ఫయాజ్, ట్రెజరర్‌గా ఖాశింపిరా, సమతా కన్వీనర్‌గా బి పరిమళని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యం

డాక్టర్ భూమా బాల నరసింహారెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : శాస్త్రియ సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని వైద్యులు డాక్టర్ భూమాబాల నరసింహారెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక గిద్దలూరు డివిజన్ 17వ మహాసభ స్థానిక సాయి మరియు రాజు పారామెడికల్ విద్యాసంస్థలో ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు డాక్టర్ భూమా బాల నరసింహారెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణం లక్ష్యంగా ఏర్పడిన జన విజ్ఞాన వేదిక గత 35 సంవత్సరాలుగా మూఢనమ్మకాలను నిరోధించడం పర్యావరణ పరిరక్షణ,బాలిక విద్య ఆరోగ్యం సామాజిక న్యాయం వంటి అనేక అంశాలపై హేతుబద్ధమైన శాస్త్రీయ ధృక్పథాన్ని సమాజంలో వ్యాప్తి చేసేందుకు కృషి చేస్తున్నదని అన్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.స్వరూప రెడ్డి మాట్లాడుతూ సమాజంలో తర్కించే తత్వాన్ని, పరిశీలించే గుణాన్ని,ఆలోచించే శక్తిని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యం అన్నారు.శాస్త్రీయ ఫలితాలు సామాన్య ప్రజలకు చేరాలని ఆలోచనతో అక్షరా స్యత, సారా వ్యతిరేక ఉద్యమాలు,కూల్ డ్రింక్స్ వ్యతిరేక ప్రచారాలు విద్యార్థిని,విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుటకు చెకుముకి సైన్స్ సంబరాల నిర్వహణ,సమ్మర్ క్యాంపు ల నిర్వహణ,సైన్స్ జాతాలను నిర్వహిస్తుందని ఆయన అన్నారు.కంటి వైద్య నిపుణులు డాక్టర్ జీకే మోహన్ రెడ్డి మాట్లాడుతూ సైన్స్ కు మానవునికి సంబంధం ఉందని సైన్స్ అనేది ఒక సబ్జెక్టు కాదని జీవితంలో ఒక భాగం అని జీవన విధానమే సైన్స్ అన్నారు.జన విజ్ఞాన వేదిక చేస్తున్న కార్యక్రమాలు అభినందించదగ్గవన్నారు.

9న శ్రామిక గర్జన జయప్రదం చేయండి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్

విశాలాంధ్ర-కనిగిరి : కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నలిగిపోతున్న కార్మిక వర్గం నరేంద్రమోడీని గద్దెదించా లని దేశాన్ని రక్షించాలని నినాదంతో ఆగస్టు 9వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో విజయవాడలో జరుగు శ్రామిక జన గర్జనను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కనిగిరి దర్శి చెంచయ్య భవన్ నుంచి ఒంగోలు బస్టాండ్, పామూరు బస్టాండ్ పురవీధుల్లో బైక్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ చలో విజయవాడ శ్రామిక గర్జన ఆందోళనలో భాగంగా పారిశ్రామిక కార్మిక వర్గం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామన్నారు. కార్మికులకు రక్షణగా ఉండే 44 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోర్స్‌గా తీసుకుని రావటం వల్ల కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అడ్డగోలుగా కార్పొరేట్ బహుళజాతి సంస్థలకు కారుషకుగా కట్ట బెడుతున్నారన్నారు. ఎల్ఐసి బి బ్యాంకులో బిపోర్టులు ఓడరేవులు విమానాశ్రయాలు అమ్మేస్తున్నారు. విశాఖ స్టీలు గంగవరం పోర్టు కార్పొరేట్ వ్యక్తులకు అమ్మడానికి కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని. రైతు చట్టాలను సవరించడం వల్ల రైతు సంఘా నికి ఉరివేసినట్లు అవుతుం దన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు చూస్తుంటే సామాన్య ప్రజలు మతిపోతుందన్నారు. ఈ పరిస్థితుల్లో ఇలాంటి శక్తుల నుండి దేశాన్ని కాపాడుకోవడానికి ఆందోళన చేయక తప్పని పరిస్థితి అన్నారు. ఆగస్టు 9వ తేదీ జరుగు శ్రామిక గర్జనలో భాగంగా ఎక్కువ సంఖ్యలో శ్రామికులు పాల్గొని కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి కనిగిరి నియోజకవర్గం అధ్యక్షుడు గుజ్జుల బాలిరెడ్డి, నాసర్, కిరణ్, సిపిఐ మండల కార్యదర్శి జి పి రామారావు, గులాం హుస్సేన్, సుబ్బారావు, పవన్ కళ్యాణ్, ఇఫ్రాస్ అశోక్, కోటయ్య, ఐజాక్, మధు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహకార బ్యాంకు జిల్లా చైర్మన్‌గా ప్రసాద్‌రెడ్డి నేడు ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-కనిగిరి : ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా మాజీ జెడ్పిటిసి వై యం ప్రసాద్ రెడ్డి (బన్నీ) ప్రమాణ స్వీకార మహోత్సవానికి జిల్లా నుంచి భారీగా వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు బన్నీ అనుచర వర్గం భారీగా తరలనున్నారు. సుమారు 5000 మంది కార్యకర్తలు నాయకులు ఒక కనిగిరి నియోజకవర్గం నుంచి ప్రమాణ స్వీకారానికి వెళ్తున్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాలోని మాజీ మంత్రివర్యులు ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, శాసన సభ్యులు మరియు. ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులకు ప్రసాద్ రెడ్డి ఆహ్వానాన్ని అందించారు. ఒంగోలు లోని బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో సోమవారం జరుగు ప్రమాణ స్వీకారానికి జిల్లాలోని జడ్పీటీసీలు, కార్పొరేట్లు, ఎంపీపీలు ఎంపీటీసీలు కనిగిరి నగర పంచాయతీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సర్పంచ్లు, కౌన్సిలర్లు జెసిసి మండల ఇన్చార్జిలు, మండల పార్టీ అధ్యక్షులు, కన్వీనర్లు, గృహ సారులు, వార్డు నెంబర్లకి ఆహ్వానాన్ని పంపారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ గా ప్రసాద్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి జిల్లాలోని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొంటున్నారు. కనిగిరి ప్రాంతానికి చెందిన వైయం ప్రసాద్ రెడ్డి సామ్యుడిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విధే యుడుగా, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డికి స్నేహితుడిగా జిల్లాలోని ప్రతి ఒక్కరికి సుపరిచితమే. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయటానికి వైయం ప్రసాద్ రెడ్డి-సరిత రెడ్డి దంపతులు ప్రత్యక్షంగా రాజకీయాల్లోకి వచ్చి ప్రజల నీరాజ నాలు అందుకుంటున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గా నియమించినందుకు పాలకులు, ప్రకాశం జిల్లా ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర-మార్కాపురం : రజక విద్యా సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదిన ఒంగోలులోని ఎస్‌విఎస్ కళ్యాణ మండపంలో పదవ తరగతిలో 450 పైన మార్కులు సాధించిన రజక విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం జరుగు తుందని మార్కాపురంకు చెందిన సంఘం నాయకులు దేవలూటి శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రజక విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి 450 పైన మార్కులు సాధించిన వారికి ఒక్కొక్కరికి రూ.5000 వేలు చొప్పున పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లాలో ఉన్న రజక విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 13న ఒంగోలులో జరిగే కార్యక్రమానికి తప్పనిసరిగా విద్యార్థులు విద్యార్థులు తండ్రులు అందరు పాల్గొనాలని అన్నారు. ఇంకా ఎవరైనా పేర్లు నమోదు చేసుకొని విద్యార్థులు ఉంటే వారు తప్పనిసరిగా 8096646072 వాట్సప్ నెంబర్ కు వివరాలు పంపించాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శంకర్ కోరారు.

అమ్మో దేవుడి దొంగలు తస్మాత్ జాగ్రత్త

విశాలాంధ్ర-కొమరోలు : పట్టణంలో దేవుడి దొంగలతో వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. దేవుడి పేరు చెప్పి దుకాణాలకు వ్యాపార సముదాయాలకు వస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నారు. కొద్దిరోజుల క్రితం ఓ కిరాణా దుకాణానికి వచ్చి దేవుడి కార్యక్రమానికి సరుకులు కావాలని షాపు యజమానిని ఏమార్చి నగదు కాజేశాడు. మరో చికెన్ షాప్‌లో కూడా దేవుడి పేరు చెప్పి 10 కేజీలకు పైగా చికెన్ కావాలని షాపు యజమానిని ఏమార్చి నగదు కాజేసి అక్కడ నుంచి పరారయ్యాడు. దేవుడి పేరు చెప్పి దుకాణాలకు వచ్చి మోసం చేస్తుండడం ఈ ప్రాంత ప్రజలలో చర్చనీయాంశంగా మారింది. అపరిచిత వ్యక్తులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరిలోని ఇందిరా కాలనీకి చెందిన ఓ యువకుడు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకెళ్తే నివాసం ఉంటున్న తవ్వ రాజేంద్ర వలంటీరుగా విధులు నిర్వహిస్తున్నాడు. రాజేంద్ర కుమారుడు (12) సాయి ఆదివారం కొత్తూరులో నివాసం ఉంటున్న తన పెద్దమ్మ ఇంటికి ఆడుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో స్నేహితు లతో కలిసి సరదాగా మేడ పైన సాయి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు మేడ పై ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో షాక్ తగిలి సాయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే బాలుడు సాయిని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించే క్రమంలో మార్గం మధ్యలో మృతి చెందాడు.

ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్నకు విప్లవ జోహార్లు

– సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ ప్రకాశం జిల్లా కమిటీ

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజా యుద్ధ నౌక, విప్లవ సాంస్కృతిక సేనాని కామ్రేడ్ గద్దర్ అన్నకు సిపిఎంఎల్ రెడ్ స్టార్ ప్రకాశం జిల్లా కమిటీ జోహార్ అర్పించింది. కామ్రేడ్ గద్దర్ అన్న అలియాస్ విట్టల్ రావు సాంస్కృతిక విప్లవోద్యమానికి కొత్త ఒరవడిని సృష్టించారు. తన ఆటపాట మాట ద్వారా ప్రజలలో తనకంటూ ఒక ముద్రను వేశారు. భూమికోసం ఈ దేశ విముక్తి కోసం కుల వివక్షత అసమానతలు దళితులపై దాడులు స్త్రీలపై హత్యాచారాలు అన్ని వర్గాల పోరాటాలకు తన గలం ద్వారా మద్దతు అందించారు. అనేక నిర్బంధాలకు హత్య ప్రయత్నాలకు గురయ్యారు. ఆయన శరీరంలో బుల్లెట్లు ఉన్నాయి. కామ్రేడ్ గద్దర్ అన్న మరణం పీడిత తాడిత ప్రజలకు దళిత బహుజన ఉద్యమాలకు తీరని లోటు. ప్రజా యుద్ధ నౌక, విప్లవ సాంస్కృతిక సేనాని కామ్రేడ్ గద్దర్ అన్నకు సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ ప్రకాశం జిల్లా లభిస్తుంది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియ జేస్తు న్నాం. సాంస్కృతిక విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకు పోవడం ప్రజలందరూ కర్తవ్యం గా భావించాలి.

పౌరసరఫరాల శాఖలో అవినీతి జలగలు..!

- యథేచ్ఛగా పొరుగు జిల్లాలకు రేషన్ బియ్యం అక్రమ రవాణా
- బియ్యం అక్రమ రవాణాలో అధికారుల సహకారం
- కార్యాలయానికే పరిమితమైన సివిల్ సప్లై అధికారులు
- రేషన్ షాపుల తనిఖీల ఊసే ఎత్తని అధికారులు
- మిల్లర్లతో డీటీలు ఎఫ్ఐలు మిలాఖత్
- దాడులు చేసిన వెలుగులోకి రాని సమాచారం

విశాలాంధ్ర-పొన్నలూరు : పౌరసరఫరాల శాఖకు అవినీతి జలగలు పట్టిపీడిస్తున్నాయి. పాలకులు అధికారులు మారినా పద్ధతి మాత్రం మారడం లేదు కొత్త అధికారులు వచ్చినప్పుడు కాస్త హడావుడి చేసినా ఆ తర్వాత సరామామూలే..! ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే రేషన్ బియ్యం వారికి చేరే విధంగా చూడాల్సిన అధికారులు, సిబ్బంది అవినీతి ఉచ్చులో కూరుకుపోతున్నారు. మిల్లర్లు, బయ్యర్లుతో మిలాఖత్ అయి నెల నెలా రేషన్ డీలర్ల వద్ద మామూళ్లకు పాల్పడుతున్నారు. ఒకవైపు రాజకీయ జోక్యం మరోవైపు అవినీతి జలగలతో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం యథేచ్ఛగా నల్లబజారుకు తరలిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పౌరసరఫరాల శాఖలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన అవినీతి జలగలు మామూళ్ల రూపంలో రక్తం పీల్చినట్టు పీ లుస్తున్నారు. రేషన్ డీలర్ల వద్ద నుండి నెల నెల ముక్కు పిండి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూసేందుకు పౌరసరఫరాల శాఖలో జిల్లా ఉన్నతాధికారులతో పాటు డివిజన్ స్థాయి అధికారులు ఫుడ్ ఇన్స్పెక్టర్లు డిటీలు ఉన్నారు. అయితే వీరి విధి నిర్వహణను పక్కనపెట్టి వ్యాపారులతో మిలాఖత్ అవుతున్నారని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. గోదాముల నుండి రేషన్ షాప్ కు వెళ్లిన బియ్యం కార్డుదారులకు అందుతున్నాయో లేదు చూడటం తో పాటు అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు కార్యాలయానికే పరిమితమవుతూ తమ పరిధిలోని వ్యాపారులతో మిలాఖత్ అవుతున్నారు. నెల రావటమే ఆలస్యం మామూళ్ల కోసం పాకులాడుతున్నట్లు సమాచారం. రేషన్ బియ్యం అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతుంది. పక్క జిల్లాలకు నిత్యం ఆటోలు మినీ లారీల ద్వారా అక్రమంగా రేషన్ బియ్యం రవాణా అవుతున్నప్పటికీ అధికారులు మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్నారు. ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో తప్ప అక్రమ రేషన్ బియ్యం పట్టుకున్న దాఖలాలు లేవు బియ్యం పట్టుకున్న సందర్భాల్లో సైతం 6ఏ కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అంతేకాక ఏ ఒక్క కేసులో నిందితులకు శిక్ష పడకపోవడం విశేషం దాంతో బియ్యం స్మగ్లర్లు కొన్ని రైస్ మిల్లు యజమానులు నిర్భయంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి మళ్లీ ప్రజలకే అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ షాపుల్లో లావుపాటి బియ్యం సరఫరా చేస్తుండడం అందులో నూక శాతం ఎక్కువగా ఉండడంతో అన్నం వండుకుంటే ముద్దుగా తయారవుతున్నదంతో ప్రజలు సైతం రేషన్ షాప్ నుంచి బియ్యం తెచ్చుకొని వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మరికొందరు ఏకంగా డీలర్లకు తమకు వచ్చిన రేషన్ బియ్యాన్ని ఆరు రూపాయలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది ఏదైతేనేమి ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో 60 శాతానికి పైగా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. రేషన్ షాపుల్లో ఈపాస్ మిషన్లు అమలులో ఉండటంతో దొంగ రేషన్ కార్డులు పూర్తిగా కనుమరుగయ్యాయి. నియోజకవర్గ పరిధిలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసే చిరు వ్యాపారులు బడా వ్యాపారులు అనేక మంది ఉన్నారు. ఈ బియ్యాన్ని నిత్యం ఆటోల ద్వారా మినీ లారీల ద్వారా ఇతర జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పాలక పక్ష నేతలు అధికార ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ నేతలు సొమ్ము చేసుకుంటున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. రేషన్ షాప్ డీలర్లు అధికారులు రాజకీయ నాయకులు వాటాలు పంచుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పౌరసరఫరాల అధికారులే కాదు రెవెన్యూ శాఖ అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. చివరకు ప్రోటోకాల్ ఖర్చులు కూడా రేషన్ అవినీతి సొమ్ము వినియోగిస్తున్నారంటూ పలువురు గుసగుసలాడుకుంటున్నారు. అప్పుడప్పుడు తనిఖీలు చేయడం సరుకులలో తేడాలు ఉన్నాయంటూ చర్యలు తీసుకోవటం కొద్దిరోజులకే మళ్లీ కేసులు నమోదు చేస్తున్నామని చెబుతూ రేషన్ బియ్యం అక్రమ వ్యవహారాల్లో నిన్న మొన్నటి వరకు పౌరసరఫరాల అధికారులు డీలర్లు మాత్రమే కుమ్మక్కయి పాలుపంచుకున్నారు. తాజాగా ఇతర శాఖల అధికారులు కూడా సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో మండల స్థాయి రేషన్ డీలర్ల సంఘాల నాయకులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎవరెవరు వాటాలు వారికి పంపే బాధ్యతను ఆ నాయకులే తీసుకుంటున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా రాజకీయ నాయకుల మితిమీరిన జోక్యంతో అవినీతి అన్నిటికంటే మించి దళారులు ఆధిపత్యంతో పేదల కంటే పెద్దలకు ఈ వ్యవస్థ కల్పతరువుగా మారిందేమో అనిపిస్తుంది.

గద్దర్‌కు జోహార్లు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ప్రజా యుద్ధ కళాకారుడు, సాంస్కృతిక యోధుడు గద్దర్ ఆదివారం హైదరాబాద్‌లో వైద్య చికిత్సలో ఉండగానే కన్నుమూసారు. ఆయన మృతికి సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేస్తున్నది. గుమ్మడి విఠల్‌రావుగా మెదక్ జిల్లా తుప్రాన్ లో జన్మించిన గద్దర్ చిన్న నాటి నుండే కళల పట్ల ఆసక్తి తో ఉండేవాడు. ఇంజనీరింగ్ చదువుకునే రోజుల్లో విప్లవోద్యమానికి ఆకర్షితులయి జానపద కళల్ని, గేయాల్ని ప్రజల్ని చైతన్య వంతం చేయడం కోసం ఉపయోగించుకునే క్రమంలో ఇతర మిత్రులతో కలిసి "జన నాట్య మండలి"ని స్థాపించాడు. విప్లవ రాజకీయాల్ని వినూత్న పద్ధతుల్లో బహుళ ప్రచారం గావించాడు. ఆనాటి విప్లవ సంస్థ పీపుల్స్ వార్ రాజకీయాలకు ఎనలేని గుర్తింపును తెచ్చారు. ఈ క్రమంలోనే రాజ్యం దాడులకు, అక్రమ కేసులకు గురయ్యారు. శరీరంలో గత ఇరవై ఏళ్లకు పైగా బుల్లెట్ ఇంకా ఉన్నది. ప్రజా కళల్ని, ప్రజా సంస్కృతిని, జానపద కళల్ని అభివృద్ధి చేయడం లో, ప్రజాపరం గావించడం లో గొప్పగా కృషి సాగించాడు. అంతిమంగా ఈ దేశ ప్రజల విముక్తి కోసం గోచి, గొంగడి ధరించి, కాలు కు గజ్జె కట్టి తనదయిన ప్రత్యేక ఆహార్యం తో, ముద్రతో ప్రజల్లోకి వెళ్లి అసాధారణమైన కృషిని సల్పారు. తెలుగు నేల మీదనే గాకుండా దేశ మంతటా కలియతిరిగి తన ఆటా, పాటా, మాటలతో ప్రజల్ని ఉర్రుతలూగించారు.తాను రాసిన అనేక పాటలు, గీతాలు ప్రజల్ని గొప్పగా చైతన్య వంతం చేసి ప్రజల్ని సమాజ మార్పు కోసం విప్లవోణ్ముఖుల్ని చేశాయి. మూడు నాలుగు దశాబ్దాలపాటు విప్లవ సాంస్కృతిక ఉద్యమాన్ని జన నాట్య మండలి ద్వారా, వ్యక్తిగా ముందుకు తీసుకెళ్లారు. కారణాలేమైనప్పటికి గద్దర్ మావోయిస్టు పార్టీ నుండి, విప్లవ రాజకియాలనుండి వైదొలిగాడు. అప్పటి వరకు తీవ్రంగా విబేధించిన బూర్జువా రాజకీయాల్ని చేపట్టాడు. బూర్జువా పార్టీలతో మమేకం అయ్యాడు. పార్లమెంటరీ ఎన్నికల పోరాటమే ప్రధాన పోరాట రూపంగా ఎంచుకొని తనదయిన పద్ధతుల్లో ముందుకు సాగుతున్నాడు.ఈ క్రమంనే గద్దర్ కన్నుమూసారు. గద్దర్ తన జీవన చివరంకం కాలాన్ని మినహాయస్తే ఆయన ప్రజా కళాకారుడుగా,విప్లవ రచయితగా, జానపద కళలకు, అభివృద్ధి కి అసమాన్యమైన కృషిని సాగించాడు. సాంస్కృతిక సేనానిగా, యోధుడిగా గొప్ప కృషి సల్పాడన్నారు.

ఐపీఎస్ ప్రతాప్ రెడ్డిని సన్మానించిన ఎంపీటీసీ

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కనిగిరి నియోజకవర్గ పరిధిలోని ఉన్న హనుమంతునిపాడు మండల పరిధిలోని హాజీపురం గ్రామానికి చెందిన ఐపిఎస్ ఆఫీసర్ డిజి మాదిరెడ్డి ప్రతాపరెడ్డిని మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డిని ఆదివారం నందనవనం ఎంపీటీసీ నారాయణస్వామి మర్యాదపూర్వకంగా కలిసి వారిద్దరకు శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇరువురు కనిగిరి నియోజకవర్గానికి చెందిన వ్యక్తులుగా అదేవిధంగా హనుమంతునిపాడు మండలం వాసులుగా కనిగిరి నియోజకవర్గాన్ని ఏవిధంగా అభివృద్ధి పథంలో నడిపించాలని మరియు యువతకు ఉద్యోగ అవకాశాలు విద్యపై అవగాహన పెంచడం వంటి అంశాలపై ఇరువురు చర్చించుకోవడం జరిగింది. అదేవిధంగా రానున్న రోజులలో కనిగిరి ప్రాంతంలో ఇండస్ట్రియల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తద్వారా నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయ కాబట్టి కనిగిరి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు నియోజకవర్గానికి చెందిన ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించుకుంటూ ముందుకు సాగాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, సర్పంచ్ ముద్దాబాబు, సర్పంచ్ రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, మూలే గోపాల్ రెడ్డి,వద్దెంపుడి శివారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చుండూరు..దళిత ఉద్యమ దిక్సూచి

– చుండూరు 32వ స్మారక కార్యక్రమంలో దళితనేత నీలం

విశాలాంధ్ర-ఒంగోలు : చుండూరు దళిత నరమేధం నుండి ఆవిర్భవించిన దళిత ఉద్యమం భారతదేశానికి తొలి రాష్ట్రపతిని ఇచ్చిందని అలాగే దళితులకు వజ్రాయుధమైన ఎస్సీ ఎస్టీ ఆక్ట్‌ను ఇచ్చిందని దళిత ఉద్యమ నేత నీలం నాగేంద్రరావు చుండూరు మాల మృత వీరులకు నివాళులర్పించారు. స్థానిక సమితి కార్యాలయంలో చుండూరు మాల మృత వీరుల 32వ స్మారక కార్యక్రమం జరిగింది. నీలం నాగేంద్ర మాట్లాడుతూ 1991 ఆగస్టు 6న ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చుండూరు మాలపల్లిపై రెడ్డి హంతకుల ముటా మారణకాండ జరిపిందన్నారు. పోలీసులచే మాలలను నిరాయుధులుగా చేసి పోలీసు బలగాల సహాయంతో మాలపల్లిపై రెడ్డి నరహంతక ముఠా మారణకాండ జరిపిందన్నారు. ఈ మారణకాండలో పదిమంది మాలలు, అమరులయ్యారు అన్నారు. మాలల శవాలను గోతాల సంచుల్లో కుక్కి తుంగభద్ర నదిలో పడేసారన్నారు. చుండూరు దళిత మారణకాండకి వ్యతిరేకంగా న్యాయం కోసం రోడ్డు ఎక్కిన దళితులపై ఆనాడు ముఖ్యమంత్రి నేదుంమల్లి జనార్ధన్ రెడ్డి దమనకాండ సాగించారన్నారు. పీపుల్స్ వార్ నక్సలైట్లు చుండూరులో దళితుల శవాల ఖననం సమయంలో రెడ్డి ఇల్లులు తగలబెట్టి మల్లారెడ్డి అనే భూస్వామిని చంపారన్నారు. కారంచెడు మాదిగ సేవలను చీరాల విజయనగర కాలనీలో సమాధి చేసి రుధిర క్షేత్రంగా పేరు పెట్టుకున్నామన్నారు కానీ చుండూరులో మాలల శవాలను చుండూరు నడి బొడ్డులో ఖననం చేసి రక్త క్షేత్రంగా చరిత్ర మిగిలిపోయింది అన్నారు. హంతక ముఠాని అరెస్టు చేయాలని బాధితులకు పునరవాసం కల్పించాలని దళితులు చేస్తున్న న్యాయ పోరాటానికి ఆనాటి ముఖ్యమంత్రి కులగజ్జితో దళితులపై పోలీసుల నిర్బంధకాండ అమలు చేయించారన్నారు. చుండూరులో నిరాహార దీక్ష చేస్తున్న కొమ్మర్ల అనిల్ కుమార్ అనే దళిత యువకుడిని దీక్ష శిబిరంలోని పోలీసులచే కాల్చి చంపించారు అన్నారు. రాష్ట్రంలో రెడ్డి రాజ్యాంగం అమలు చేస్తుంటే గతిలేక మానవ హక్కుల కోసం చుండూరు దళితులు ఢిల్లీ పాట పట్టారని తెలిపారు. బ్రాహ్మణ రాష్ట్రపతి వెంకటరమణ చుండూరు దళితులని కలవడానికి నిరాకరించారు. 109 మంది దళిత ఎంపీల ఆత్మగౌరవ పోరాటంలో భాగంగా చుండూరు దళిత ఉద్యమానికి మద్దతుగా దళితుడు రాష్ట్రపతి కావాలని నిలదించింది చుండూరు ఉద్యమం. చుండూరు దళిత ఉద్యమ పోరాట ఫలితమే కేఆర్ నారాయణన్ తొలి దళిత రాష్ట్రపతి అయ్యాడు అన్నారు. అలాగే భారత దేశంలో అనేక రాష్ట్రాలలో దళితవాడలో దహనం చేసిన దళితుల రక్షణకు పొదునైన చట్టాలు ఏమి రాలేదు కానీ చుండూరు దళిత మృతవీరుల రక్తపు మడుగుల నుంచి దళితులకు వజ్రాయుధమైన ఎస్సీ ఎస్టీ యాక్ట్ వచ్చిందన్నారు. చుండూరు దళిత ఉద్యమం భారత దేశ దశా దిశలను మార్చిందన్నారు. చుండూరు అమరవీరులకు నీల్‌లాల్ సలాములు తెలుపుకుంటున్నామని దళితనేత నీలం నాగేంద్రరావు చుండూరు మృతుల వీరులకు మరోసారి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో దారా అంజయ్య, దళిత నాయకుడు దేవరపల్లి రమణయ్య ఏలూరి శ్రీనివాసరావు ముత్తన పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఒంగోలుతో ఎనలేని అనుబంధం

దళిత నేత నీలం నాగేంద్రరావు

విశాలాంధ్ర-ఒంగోలు : గద్దర్ ఆకస్మిక మరణంతో, దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు మీడియాతో గద్దర్ కు సంబంధించిన అనేక అంశాలను తెలియజేశారు.మెదక్ జిల్లా తూప్రాన్ మాల పల్లెలో జన్మించిన గుమ్మడి విఠల్ అలియాస్ గద్దర్ కు ఒంగోలుతో విడదీయరాని అనుబంధం ఉంది. పోరాటాల పురిటి గడ్డ ఒంగోలు గద్దర్ ఆట పాటలకు అనేక సార్లు వేదికయింది. కారంచేడు నరమేధం నేపథ్యంలో గద్దర్ రాసి, పాడిన "దళిత పులులమ్మ" పాట దళిత జాతి జాతీయ గీతం అయింది. జననాట్యమండలి వ్యవస్థాప కుల్లో ఒకరుగా పీపుల్స్ వార్ పార్టీలో పనిచేసిన గద్దర్‌కు ప్రకాశం జిల్లాలో అనేకమంది మావోయిస్టు పార్టీ సానుభూతి పరులతో పాటు, దళిత ఉద్యమ నాయకులతో సన్నిహిత సంబంధాలు, పరిచయాలు ఉన్నాయి. ఈ పరిచయాల్లోంచి గద్దర్ చాలాసార్లు ఒంగోలు వచ్చి వెళ్లారు. గద్దర్ అంటే మోచేతికి ఎర్ర రుమాలు, చేతిలో కర్ర, కాలికి గజ్జలు, భుజాన గొంగళి, ఇది జనాలకు తెలిసిన గద్దర్ ఆహార్యం. అయితే గద్దర్ చాలాసార్లు సింపుల్‌గా టక్ చేసుకుని, చేతిలో ఒక బ్రీఫ్ కేస్ పట్టుకుని రైల్లో ఒంగోలు వచ్చి వెళ్లేవారు. 1992 లో పివిఆర్ గ్రౌండ్స్ లో సారాయి వ్యతిరేక ఉద్యమ సభలో గద్దర్ పాల్గొన్నారు. 1996లో జరుగుమల్లి మండలం చిరుకూరు పాడులో జరిగిన అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. పూర్వపు కరీంనగర్ జిల్లా కొయ్యూరులో 1999 డిసెంబరు 2న భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎన్‌కౌంటర్ లో అప్పటి పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ సభ్యుడు నల్లా ఆదిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రం సంతోషరెడ్డి, ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి శీలం నరేష్ మృతి చెందారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్ నేపధ్యంలో 2000 సంవత్సరం జనవరి 5న తాతా కళ్యాణ మండపంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు అధ్యక్షతన జరగాల్సిన బూటకపు ఎన్‌కౌంటర్‌ల వ్యతిరేక సదస్సుకు గద్దర్ ఒంగోలు వచ్చారన్నారు.

జడ్జిలు, లాయర్లు కలిసి పనిచేయాలి

విశాలాంధ్ర-మార్కాపురం : న్యాయవ్యవస్థ గౌరవాన్ని పెంచేందుకు జడ్జీలు, లాయర్లు కలిసి పనిచేయాలని హైకోర్టు జడ్జి మరియు జిల్లా కోర్టు పరిపాలనా వ్యవహారాలు చూస్తున్న జడ్జి జస్టిస్ మన్మథరావు అన్నారు. ఆదివారం మార్కాపురం పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో 1.50 కోట్లతో నిర్మించిన జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి నివాస గృహాన్ని ప్రారంభి. 6 కోట్లతో నిర్మిస్తున్న రెండు న్యాయస్థాన భవనాల శంకుస్థాపన కార్యక్రమాల్లో హైకోర్టు జడ్జిలు జి రామకృష్ణ ప్రసాద్, ఎవి రవీంద్రబాబులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటైన కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ భారతి అధ్యక్షత జస్టీస్ మన్మధరావు మాట్లాడుతూ పాజిటీవ్ మైండ్తో న్యాయవాదులు, న్యాయమూర్తులు కోర్టుకు రావాలని, బార్ అండ్ బెంచ్ మధ్య మంచి వాతావరణం ఉంటే సమాజానికి అవసరమైన మంచి తీర్పులు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఎవరూ కూడా లక్ష్మణ రేఖను దాటకూడదనీ, ప్రజలకు న్యాయం అందించేందుకు అందరూ కృషిచేయాలని సూచించారు. న్యాయవాదులు కేసును కోర్టులో చక్కగా ప్రజెంట్ చేస్తే మంచి తీర్పు వస్తుందన్నారు. కోర్టుల్లో పెండింగు కేసుల సంఖ్యను తగ్గించాలని సూచించారు. తనకు మార్కాపురంతో ప్రత్యేక అను బంధముందని, ఆయన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. జస్టిస్ జి రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ న్యాయవాదులు కేసులను స్టడీచేయాలని అప్పుడే న్యాయ మైన తీర్పు వస్తుందని అన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం కనుగొనాలన్నారు. యువ న్యాయవాదులు సీనియర్ల నుంచి కోర్టు విధులు, చట్టాలు, తీర్పుల గురించి తెలుసుకోవాలన్నారు. వీలైనప్పు డల్లా జూనియర్ న్యాయవాదులకు సదస్సులు నిర్వంచి తమను ఆహ్వానిస్తే తాము ఇక్కడికి వచ్చి సలహాలు. సూచనలు అందిస్తామన్నారు. ఆస్టిస్ రవీంద్రబాబు. న్యాయవాదులు నిజాయితీ కలిసి ఉండాలన్ని వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. న్యాయవాద వృత్తిలో కొత్తగా వచ్చిన వారు సంపాదనే ధ్యేయంగా కాకుండా సీనియర్ న్యాయవాదుల నుంచి కోర్టు ఇచ్చే తీర్పులను తెలుసుకోవాలన్నారు. సీనియర్లు కూడా జూనియర్లకు చట్టాల గురించి చెప్పాలన్నారు. ఫుల్టైం కోర్టులోనే ఉండాలని సూచించారు. సర్వమత ప్రార్థనలను నిర్వహించారు. మార్కాపురం బార్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అనంతరం జడ్జీలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా 6వ ఎఅధనపు ఇన్ఛార్జి న్యాయమూర్తి జస్టిస్ రాజా వెంకటాద్రి, సబ్ కలెక్టర్ సేదు మాధవన్, డివైఎస్ పి వీర రాఘవరెడ్డి స్థానిక న్యాయమూర్తి కరీముల్లా, బార్ అసోషియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె శ్రీనివాస చౌదరి, అన్వర్‌బేగ్, పీపీలు గాంధిరెడ్డి, నాయక్, న్యాయవాదులు అల్లిజహీర్, శ్రీరామ్‌రెడ్డి, బత్తుల రామిరెడ్డి, బూపని కాశయ్య, కృష్ణశాస్త్రి, వై వెంకటేశ్వరరెడ్డి, ఉమ్మడి రవీంద్రనాథ్, పి రామచంద్ర, మధుసూదన్‌రెడ్డి, ఆర్‌వి నాగేశ్వరశాస్త్రి, వి శ్రీనివాసరావు, మదిరె మల్లకార్జునరెడ్డి, తండ్రి కొడుకులైన పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్, నాగార్జున ప్రసాద్ యాదవ్, శారద, పి.రామచంద్ర పాల్గొన్నారు. కాగా న్యాయ మూర్తులకు పోలీసు గౌరవ వందనం సమర్పించారు. సీఐ భీమానాయక్, ఎస్ఐలు శశికుమార్, వెంకటేశ్వర నాయక్, శ్రీహరి, రాజేష్, కృష్ణపావని, సువర్ణ మల్లేశ్వరరావు, కోటయ్య తదితరులు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో 'ఈ - క్రాఫ్' నమోదు?

- గతవారం స్పందనలో ఫిర్యాదు చేసినా..స్పందన నిల్
- 'విశాలాంధ్ర'కు తెలియజేసిన బాధితులు

విశాలాంధ్ర-పీసీపల్లి : తాను సాగు చేసే భూమిని కాకుండా తన పక్క భూమిపై కన్నేసి ఫోర్జరీ సంతకాలు సృష్టించి భూమి యజమానికి తెలియకుండా కౌలు కార్డు మంజూరు చేయించు కోకుండా వ్యవసాయ అధికారులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఎకరాలు 14.25 సెంట్లకు ఈ క్రాఫ్ నమోదు చేయించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా రైతుల అకౌంట్లోకి నగదు జమ కావడంతో ఈ తతంగం వెలుగులోకి వచ్చింది. తాను దరఖాస్తు చేసుకున్న ఎకరాలు 14.25 సెంట్లు ఈ క్రాఫ్ దరఖాస్తు చేసుకున్నప్పటికీ నగదు జమకాకపోవడంతో కంగుతున్న భూ యజమాని తన పొలాన్ని తన పక్క భూమి సాగుదారుడైన రైతు పేరుపై ఈ క్రాఫ్ నమోదయి తన అకౌంట్లో నగదు జమ కాకపోవడంతో అసలు విషయం తెలుసుకొని నెవ్వరపోయిన సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం ఓరుగంటివారిపాలెం గ్రామానికి చెందిన బయ్యపునేని మాధవరావు బ్రహ్మయ్య అన్నదమ్ములు వీరు వ్యాపా ర రీత్యా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కాగానే వారికి సంబంధించిన భూమిలో పంటలు సాగు చేసి సమయం దొరికినప్పుడు గ్రామానికి వచ్చి వెళ్తూ ఉండేవారు. వీరిద్దరికీ ఒకే సర్వే నెంబర్లతో పీసీపల్లి మండలం చౌట గోగులపల్లి రెవెన్యూ పరిధిలో మాధవ రావుకు ఎకరాలు 14.50 సెంట్లు, బ్రహ్మయ్యకు ఎకరాలు 14.25 సెంట్లు వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో 2022 సంవత్సరానికి సంబంధించి కంది పంటను సాగు చేశారు. ఇద్దరు అన్నదమ్ములు కంది పంటను సాగు చేసినట్లు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ క్రాఫ్ నమోదు చేయించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు వీఆర్వో కంది పంటను పరిశీలించి ఈ క్రాఫ్ నమోదు చేశారు. అనంతరం విపత్కర



గతవారం స్పందనలో ఫిర్యాదు చేసిన రసీదు

పరిస్థితులు వర్షాభావ పరిస్థితులు వల్ల కంది పంటను నష్టపోయారు. జులై 8న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా నష్టపోయిన పంటలు జాబితా నగదును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు అకౌంట్లో జమ చేశాయి. అయితే ఇక్కడే ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది.

ఫోర్జరీ సంతకాలతో భూమిని ఆన్లైన్ తొలగించి కౌలు కార్డు మంజూరు చేయకుండానే ఈ క్రాఫ్ నమోదు :

బయ్యపునేని మాధవరావు బ్రహ్మయ్య పొలం పక్కనే పీసీపల్లి మండలం రేగడ గ్రామానికి చెందిన సింగు నాగరాజుకి సంబంధించిన వ్యవసాయ భూమి ఉంది. అనూహ్యంగా ఆ భూమిపై అతని కన్నుబడింది. భూమిని ఆన్లైన్ తొలగించి కౌలుకు తీసుకున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి గ్రామ వ్యవసాయ సహాయకులు వీఆర్వో వ్యవసాయ శాఖ అధికారులతో కుమ్మక్కై తన పొలంతో పాటు తన పక్క పొలం అయిన భయ్యపునేని బ్రహ్మయ్యకు చెందిన ఎకరాలు 14.25 సెంట్లు భూమికి ఫోర్జరీ సంతకాలతో యజమానికి తెలియకుండా కౌలు కార్డు మంజూరు చేయకుండా తన పేరుపై కౌలుకు తీసుకున్నట్లు ఈ క్రాఫ్ నమోదు చేయించాడు. ఈ వ్యవహారం మొత్తం రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారుల అందండలతోనే నమోదు చేయించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులకు తెలియకుండానే ఈ తతంగం జరిగిందా? :

ఇదిలా ఉండగా గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామ వీఆర్‌ఓ ద్వారా సదరు భూ యజమాని ముందుగా కౌలుకు తీసుకున్నట్లు భూమి యజమానితో లిఖితపూర్వకంగా అర్జీ సంబంధిత భూమి యజమాని ఆధార్ కార్డు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ సంబంధిత పత్రాలతో రెవెన్యూ అధికారుల వద్ద ముందుగా కౌలు కార్డును మంజూరు చేయించుకోవాలి.

సింగు నాగరాజుకు నగదు జమైనట్లు తెలియపరుస్తున్న ఈ క్రాఫ్ లిస్టు

బాధితుడు బయ్యపునేని బ్రహ్మయ్య

అనంతరం కౌలుకు తీసుకున్న రైతు పంటలను వేసుకోవాలి. అనంతరం గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా కౌలు కార్డును చూపించి వేసిన పంటకు ఈ క్రాఫ్ నమోదు చేసుకుంటాడు. కానీ ఈ రైతు ఇలాంటివి ఏమీ చేయకుండా భూమి యజమానికి తెలియకుండా నకిలీ పత్రాలు సృష్టించి ఫోర్జరీ సంతకాలతో యథేచ్ఛగా రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులతో కుమ్మక్కై తన పేరు మీద ఈక్రాప్ చేయించుకోవడంతో ప్రధానమంత్రి ఈ ఫసల్ బీమా యోజన పథకం ద్వారా భయ్యపునేని బ్రహ్మయ్యకు చెందాల్సిన నగదు సింగు నాగరాజు అకౌంట్లో రూ.221905 రూపాయలు జమ అయినట్లు బాధితులు తెలియజేశాడు. రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే తమకు రావలసిన నగదు నాగరాజు ఖాతాలో క్లైమ్ ఐడి (235817585) తో జమ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

స్పందనలో ఫిర్యాదు చేసినా... స్పందన నిల్ :-

తనకు జరిగిన అన్యాయంపై గత సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన స్పందన కార్యక్రమంలో బాధితులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి వారం గడుస్తున్న స్పందన లేకపోవడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. స్పందనలోనే సమస్యకు పరిష్కారం దొరకకపోవడంతో మరెవరికి తమ బాధను చెప్పుకోవాలో అర్థం కాని అయోమయ స్థితిలో భూ యజమానులు ఉన్నారు. ఫోర్జరీ సంతకాలతో తమ భూమిని ఆన్లైన్ నుంచి తొలగించి తమకు తెలియకుండా ఈ క్రాఫ్ నమోదు చేయించిన సింగు నాగరాజుపై ఉన్నతాధికారుల చర్యలు తీసుకోవాలని బాధితులు బయ్యపునేని బ్రహ్మయ్య కోరుతున్నారు.